క్లుప్తంగా

అలరించిన సంకీర్తన రామకథా గానం



గీతాలు ఆలపిస్తున్న శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీకి చెందిన విద్యార్థులు సంకీర్తన రామకథా గానంతో అలరించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని శ్రీ వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులచే సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంకీర్తన రామకథా గానంతో ఆకట్టుకున్నారు. 'బ్రహ్మమొక్కటే...', 'కొండలలో నెలకొన్న కోనేటి రాయడు...' వంటి భక్తిగీతాలు ఆలపించి అలరించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు వారిని సత్కరించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు భావనరెడ్డి



ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని భావనరెడ్డి జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.దుర్గ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాకినాడ జిల్లా పిఠాపురం వేదికగా జరిగిన ఆంధ్రప్రదేశ్ 10వ అంతర్ జిల్లాల జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలలో భావన రెడ్డి ఉత్తమ ప్రతిభ కనబరిచి టీమ్ విజయంలో కీలక పాత్ర పోషించింది. దీంతో మే నెల 9వ తేదీ నుంచి పాండిచ్చేరిలో జరగనున్న జాతీయ స్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల డీన్ శేషబాబుతో పాటు ప్రిన్సిపల్ ఎస్.దుర్గ భావన రెడ్డికి అభినందనలు తెలిపారు.

డిజిటలైజేషన్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఆచార్య జేమ్స్ స్టీఫెన్



ప్రిన్సిపాల్ నరసింహారావును సత్కరిస్తున్న ఆచార్య స్టీఫెన్

విశాఖ విద్య: డిజిటలైజేషన్‌తోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ అన్నారు. వర్సిటీలోని అంబేడ్కర్ చైర్‌లో రెండు వారాల పాటు నిర్వహించిన ఐసీఎస్ఎస్ఆర్ స్పాన్సర్డ్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్‌ను మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ఆచార్య నరసింహారావు ప్రారంభించారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులతో పాటు, రీసెర్చ్ స్కాలర్స్, అధ్యాపకులకు సైతం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆచార్య జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ ఈ నెల 14 వరకు కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అన్ని రంగాల్లోనూ డిజిటలైజేషన్ పాత్ర గణనీయంగా పెరిగిందన్నారు. మొదటి రోజు ఆచార్య ఎం. రాంజీ డిజిటలైజేషన్‌లో టెక్నాలజీ పాత్ర, ఆచార్య గోవాడ వీర్రాజు పాలనారంగంలో వస్తున్న మార్పులను వివరించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావును అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ ఆధ్వర్యంలో సత్కరించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చీకట్లు.. ఇక్కట్లు

తూర్పులో అంధకారం

పట్టించుకోని అధికారులు



పన్నెండో వార్డు పరిధి పెదగదిలి కొండవాలులో లైటు వెలగని 32/బి/8 నంబరు గల స్తంభం



పదమూడో వార్డు పరిధి లక్ష్మీనగర్‌లో అంధకారం



తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్ కోదండ రామాలయం ఎదురుగా వెలగని వీధి దీపం



పదో వార్డు వివేకానందనగర్‌లో 228ఎ/4 నంబరు స్తంభానికి వెలగని లైటు



ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో నెలల తరబడి వీధి దీపాలు వెలగడం లేదు. ప్రతి వీధిలో రెండు, మూడు దీపాలు వెలగడం లేదు. పార్కుల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. స్థానికులు జీవీఎంసీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు లేరు. గతంలో సచివాలయాల్లో ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారమయ్యేది. కానీ, ఇప్పుడు అక్కడ కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీవీఎంసీ గ్రీవెన్స్‌లో వందల సంఖ్యలో ఫిర్యాదులు

జోన్–2లో కొండవాలు ప్రాంతంలో సమస్య మరింత తీవ్రంగా ఉంది. జోడుగుళ్లపాలెం నుంచి పైనాపిల్ కాలనీ వరకు, డెయిరీ ఫారం ప్రాంతం, ఇందిరానగర్ నుంచి ఆరిలోవ కాలనీ వరకు, కంబాలకొండ వెనుక భాగం చీకటిమయంగా ఉంది. హనుమంతవాక నుంచి దీన్ దయాల్ పురం వరకు సింహాచలం దేవస్థానం కొండవాలు ప్రాంతంలో కూడా దీపాలు వెలగడం లేదు. జీవీఎంసీలో అధికారులు నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎక్కువగా తూర్పు నియోజకవర్గం నుంచి విద్యుత్ దీపాలు వెలగడంలేదన్న ఫిర్యాదులే వందల సంఖ్యలో వస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

పరిష్కారంపై నిర్లక్ష్యం: ఫిర్యాదులు అందిన వెంటనే కొన్ని వీధి దీపాలు వెలిగిస్తున్నప్పటికీ, ఆ తరువాత వాటిని వదిలేస్తున్నారు. దీంతో వేసిన బల్బులు కొద్ది రోజులకే పాడవుతున్నాయి. మరికొన్ని చోట్ల పాత బల్బులు మొరాయిస్తున్నాయి. నిత్యం నిర్వహణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వస్తుందని స్థానికులు చెబుతున్నారు.

నియోజకవర్గ గణాంకాలు

నియోజకవర్గంలో ఉన్న విద్యుత్ స్తంభాలు	15,926
సపోర్టింగ్ స్తంభాలు :	1,500
అమర్చిన దీపాలు :	3,655
వెలగని వీధి దీపాలు :	980



పదకొండో వార్డు అంబేడ్కర్ నగర్‌లో వెలగని 18/బి/1/4 నంబరు గల స్తంబం..



అలంకార ప్రాయంగా విద్యుత్ దీపం

ఎంవీపీ రైతు బజార్‌ను వినూత్నంగా తీర్చిదిద్దాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్



రైతులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జేసీ మయూర్

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ రైతు బజార్‌ను మరింత వినూత్నంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సూచించారు. నగర పర్యటనలో ఉన్న ఆయన మంగళవారం మధ్యాహ్నం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌తో కలిసి ఎంవీపీ కాలనీ రైతు బజార్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత రైతు బజార్ ప్రాంగణాన్ని పరిశీలించిన ఆయన రైతులకు, వినియోగదారులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. బజార్‌లో స్టాల్స్ నిర్వహణ, పారిశుద్ధ్య నిర్వహణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలువురు రైతులతో ముచ్చటించారు. కూరగాయలు విక్రయిస్తున్న రైతుల స్టాల్స్ వద్దకు వెళ్లి ఏఏ గ్రామాల నుంచి, ఎంత దూరం నుంచి రైతు బజార్‌కు వస్తున్నారు, ప్రస్తుతం ఎలాంటి కూరగాయలు పండిస్తున్నారు, ధరలు లాభదాయకంగా ఉంటున్నాయా, ఆయా ఉత్పత్తుల కొనుగోళ్లకు వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారా వంటి వివరాలను తెలుసుకున్నారు. గిరిజన ప్రాంతాల రైతులతో మాట్లాడగా ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చి వారంలో 4 రోజులు విక్రయాలు చేసుకుంటున్నామని, రాత్రిపూట బస చేసేందుకు ఎంవీపీ రైతు బజార్‌లో ప్రత్యేక వసతి సదుపాయం అందుబాటులో ఉందని తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడుతూ విశాఖలో అతిపెద్ద రైతు బజార్‌గా ఉన్న ఎంవీపీ రైతు బజార్‌ను మరింత వినూత్నంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. రైతులు, వినియోగదారులకు మరిన్ని మెరుగైన సదుపాయాలు అందించే విధంగా ప్రణాళికలు రచించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవీపీ రైతు బజార్ ఎస్టేట్ అధికారి వరహాలు, సిబ్బంది కనకరాజు పాల్గొన్నారు.

ఘనంగా ఉత్కళ్ దివస్



ఉత్కళ్ దివస్‌లో పాల్గొన్న ప్రముఖులు



పాటలు పాడుతున్న కళాకారులు

బీచ్ రోడ్డు: ఒడిశా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. దసపల్లా హిల్స్‌లోని ప్రాంగణంలో వేడుకలు జరిపారు. 1936 ఏప్రిల్ 1న భాషా ప్రాతిపదికన ఒడిశా రాష్ట్రం ఏర్పాటు జరిగిన సందర్భాన్ని పురస్కరించుకుని ఒడిశా వాసులంతా ఈ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఒడియా ఫుడ్ ఫెస్టివల్, హ్యాండ్లూమ్ ఫెస్టివల్‌ను కేంద్ర ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ డాక్టర్ రాజేంద్ర కుమార్ ప్రారంభించారు. ఒడిశా ప్రత్యేక వంటకాలైన కాకరా, చెనాపోడా, దహి బారా, గుగుని, మాల్పువా వంటివి ప్రదర్శించారు. సంప్రదాయ చేనేత ఉత్పత్తులను తిలకించి ప్రశంసించారు. ఒడిశా ప్రాంత ప్రముఖులైన మధుసూదన్ దాస్, గోపబంధు దాస్, కృష్ణ చంద్ర గజపతి మహారాజ్ వంటి వ్యక్తులకు ఈ సందర్భంగా నివాళులర్పించారు. తూర్పు కోస్తా రైల్వే అదనపు డివిజనల్ మేనేజర్ మనోజ్ కుమార్ సాహు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఆర్ సాహు సంకలనం చేసిన సాహిత్య వార్షిక పత్రిక 'సమాజ్ అరుణియా'ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉత్కల్ సమాజ్ ప్రధాన కార్యదర్శి బిమల్ కుమార్ మహంత, సమాజ్ అధ్యక్షుడు జితేంద్ర నాయక్ పాల్గొన్నారు.

రాళ్లు తేలిన రహదారులు



సింహగిరికాలనీ ఎదురుగా సర్వీస్ రోడ్డులో పైకి తేలిన రాళ్లు



సంజయ్‌గాంధీకాలనీ ఎదురు సర్వీస్ రోడ్డులో గొయ్యి

ఆరిలోవ: హనుమంతవాక నుంచి అడవివరం వరకు ఉన్న బీఆర్‌టీఎస్‌లో సర్వీస్ రోడ్డు పలుచోట్ల శిథిలమైంది. కొన్నిచోట్ల రోడ్లు గుంతలమయం కాగా మరికొన్ని చోట్ల రాళ్లు తేలిపోయాయి. దీంతో ఈ రోడ్డుపై వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారిపై కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిత్యం తిరుగుతుంటాయి. రాళ్లు తేలిపోవడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. పెదగదిలి నుంచి విమ్స్ ద్వారం వరకు సర్వీస్ రోడ్డు చిత్తడి నేల మాదిరిగా మారిపోయింది. సింహగిరి కాలనీ, పాత పందుల ఫారం వద్ద అన్న క్యాంటీన్ ఎదురుగా బీటీ రోడ్డు పైపొర పూర్తిగా శిథిలమైంది. గత ఏడాది వర్షాలకు తారు అంతా కరిగిపోయి రాళ్లు పైకి తేలిపోయాయి. వాహనచోదకులు తరచూ ఈ రోడ్డుపై అదుపు తప్పి గాయాల పాలవుతున్నారు. దీంతో పాటు హెల్త్‌సిటీ పరిధి నారాయణ ఆసుపత్రి నుంచి క్యూ–1 ఆసుపత్రి వరకు, రామకృష్ణాపురం కూడలి నుంచి కేంద్ర కారాగారం వరకు రోడ్డుపై పలుచోట్ల గుంతలు పడి రాళ్లు తేలిపోయాయి. అధికారులు స్పందించి ఇక్కడ సర్వీస్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

అపరిశుభ్రంగా పిల్లల పార్కు



వ్యర్థాలు, డెబ్రిస్‌తో పార్కు పరిసరాలు



పార్కులో వ్యర్థాలను తగలబెట్టడంతో నల్లగా మారిన గోడలు

ఏయూ క్యాంపస్: పిల్లల పార్కు అంటే ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం కలిగి ఉంటుంది. అదేవిధంగా అక్కడ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. దీనికి భిన్నంగా చినవాల్తేరులోని పిల్లల పార్కు ఉంది. పాత సీబీఐ కూడలి నుంచి చినవాల్తేరుకు వెళ్లే మార్గంలో ఈ పార్కు ఉంది. రెల్లి వీధికి సమీపంలో ఉన్న ఈ పార్కును నిత్యం సాయంత్రం వేళల్లో పదుల సంఖ్యలో చిన్నారులు ఆడుకోవడానికి వస్తున్నారు. అపరిశుభ్రంగా పార్కు ఉండడంతో పిల్లలకు అనారోగ్యాలు సోకుతున్నాయి. పార్కులో ఎక్కడ చూసినా ఎండిన ఆకులు, వ్యర్థాలు, కవర్లు కనిపిస్తున్నాయి. పార్కు నిర్వహణ, శుభ్రం చేయడం పూర్తిగా గాలికి వదిలేసినట్లు స్పష్టమవుతోంది. అదేవిధంగా పార్కులో డెబ్రిస్, వ్యర్థాలు పేరుకుపోయి అధ్వానంగా ఉన్నాయి. పార్కులో ఎండిపోయిన ఆకులను తొలగించాల్సి ఉండగా సిబ్బంది అక్కడే మంట పెడుతున్నారు. దీంతో అందమైన బొమ్మలతో ఆహ్లాదంగా కనిపించాల్సిన గోడలు నల్లగా దర్శనమిస్తున్నాయి. జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది దృష్టి సారించి పార్కు నిర్వహణ, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్థానికులు కోరుతున్నారు. త్వరలో వేసవి సెలవులు రానున్న నేపథ్యంలో పార్కులను పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

స్కాలర్‌షిప్‌లను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మాయా సుందర రాజన్

విశాఖ విద్య: అమెరికాలో ఉన్నత విద్య, పరిశోధనలకు అందించే వివిధ స్కాలర్‌షిప్‌లను భారతీయ యువత సద్వినియోగం చేసుకోవాలని యునైటెడ్ స్టేట్స్ ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చెన్నై రీజినల్ ఆఫీసర్ మాయా సుందర రాజన్ అన్నారు. మంగళవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల పరిధిలో ఫుల్‌బ్రైట్ నెహ్రూ స్కాలర్‌షిప్‌తో పాటు వివిధ స్కాలర్‌షిప్‌లపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్‌లపై విస్తృత అవగాహన కల్పించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశంతో ఉన్నత విద్య సంబంధాలను మరింత బలోపేతం చేసే విధంగా ఈ స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్ 1946లో ప్రారంభమైందని, ప్రస్తుతం 160 దేశాల్లో ఇది అమలవుతుందని చెప్పారు. ఇప్పటివరకు నాలుగు లక్షల మందికి ఈ స్కాలర్‌షిప్ ద్వారా అమెరికాలో ఉన్నత విద్యను పొందే అవకాశాన్ని పొందారని చెప్పారు. ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం.వి.ఆర్. రాజు మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్య, పరిశోధన జరపడానికి ఎంతో ఉపయోగకరంగా స్కాలర్‌షిప్‌లు నిలుస్తాయని చెప్పారు. ఈ స్కాలర్‌షిప్‌లు సాధించిన వారు విదేశాల్లో పొందే వివిధ సదుపాయాలు, అవకాశాలు తెలియజేశారు. ఏ దేశంలో పరిశోధన చేయాలి అనే అంశంపై నిర్దిష్టమైన అవగాహనతో ఉండాలని సూచించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ఏయూ క్యాంపస్: రుతువులు మారే సమయంలో ఆరోగ్య పరిరక్షణ పట్ల ఎంతో శ్రద్ధ వహించాలని ఆయుర్వేద నిపుణులు డాక్టర్ మధుమిత కృష్ణన్ అన్నారు. మంగళవారం బీచ్‌రోడ్డులో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న సమయంలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడం, జీర్ణక్రియను బలపరుచుకోవాలని సూచించారు. నెయ్యి, కూరగాయలు, ఆకుకూరలు, బాదం వంటివి నిత్య ఆహారంలో భాగంగా చేసుకోవాలన్నారు. ఆకుకూరలు, తృణధాన్యాలు, బాదం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఇతర పోషకాలతో కూడిన రోజువారీ ఆహార ప్రణాళికలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత అవసరాలు, ఆరోగ్య ప్రాధాన్యత ఆధారంగా ఆహారాన్ని ఎంపిక చేసుకుని భుజించాలన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

సీతంపేట: శీతల్ స్వర ఈవెంట్స్ ఆధ్వర్యంలో ద్వారకా నగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను రంజింపజేసింది. పల్లా బాబ్జి, వెంకట్, లక్ష్మీ సరస్వతి ఆధ్వర్యంలో గాయనీగాయకులు పాత సినిమాల్లోని హిట్ సాంగ్స్ ఆలపించి అలరించారు. గాయనీగాయకులు వెంకటేష్ మాస్టారు, కృష్ణంరాజు, ఎ.నర్సింగ్, భాగ్యలక్ష్మి, మాధురి, కృష్ణవేణి పాటలు పాడి వీనుల విందు చేశారు.

వేంకటేశ్వరస్వామి వ్రతం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి తదితరులు

ఎంవీపీకాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహించనున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వ్రతం పోస్టర్‌ను తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–8లోని హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్యాలయ ప్రతినిధులు మాట్లాడుతూ స్వామి వారి కృపా కటాక్షాలు అందరికీ అందాలనే ఆకాంక్షతో రెండు బ్యాచ్‌లుగా ఈ వ్రతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యాలయంలో 13వ తేదీ ఉదయం 8.30 గంటలకు ఒక బ్యాచ్, 11 గంటలకు ఒక బ్యాచ్ వ్రతంలో ఉచితంగా పాల్గొనే వీలుందన్నారు. వ్రతంలో పాల్గొనదలచిన భక్తులు 98662 39942, 85006 41729 నంబర్లను సంప్రదించి ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టీటీడీ సూపరింటెండెంట్ ఎం.కాంతికుమార్, జిల్లా ధార్మిక కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు, సత్యకుమార్, శ్రీనివాస్, గోపాలరావు, కేవీవీ సత్యనారాయణ, రమాదేవి పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..



కేఆర్ఎం కాలనీ శివాలయం దారిలో చెత్తకుప్పలు

మద్దిలపాలెం: జీవీఎంసీ 23, 16 వార్డుల్లో చెత్తకుప్పలు ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. వరుసగా మూడు రోజులు సెలవులు కావడంతో పారిశుద్ధ్య సిబ్బంది చెత్త తొలగింపు ప్రక్రియను పట్టించుకోలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సెలవులు వస్తే చెత్తకుప్పలతో అధ్వానంగా తయారవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ కాలనీవాసులు మండిపడుతున్నారు. జీవీఎంసీ 23, 16 వార్డుల్లో గల ప్రధాన రహదారి కేఆర్ఎం కాలనీ రోడ్డులో ఇటు కృష్ణా కళాశాల రోడ్డు నుంచి అటు కేఆర్ఎం కాలనీ శివాలయం వైపు వెళ్లే దారిలో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఈ చెత్తను మూడు రోజులుగా తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోందని కాలనీవాసులు పేర్కొంటున్నారు. పేరుకుపోయిన చెత్త రోడ్లపై చెల్లాచెదురుగా తయారవుతోందని అంటున్నారు. సెలవులు వస్తే ఇదే పరిస్థితి పునరావృతం అవుతోందని, దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉద్యోగావకాశాలు



అవగాహన కల్పిస్తున్న గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ

మురళీనగర్: పదో తరగతి అనంతరం పాలిటెక్నిక్ విద్యను అభ్యసించడం వల్ల తక్షణ ఉద్యోగావకాశాలు లభిస్తాయని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. కాలేజీ సమీపంలోని శ్రీశాంతి నికేతన్ ఉన్నత పాఠశాలలో సాంకేతిక విద్యపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. పాలిటెక్నిక్ విద్యను అభ్యసించి 18 ఏళ్లు దాటిన విద్యార్థులకు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో మంచి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. పాలిటెక్నిక్ కోర్సులు చదవడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడటమే కాకుండా బీటెక్‌లో నేరుగా రెండో సంవత్సరంలో చేరి ఉన్నత విద్యను కొనసాగించుకోవచ్చన్నారు. కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో చేరిన విద్యార్థులు నూరు శాతం క్యాంపస్ ఉద్యోగాలు సాధించిన విషయాన్ని ఆయన వివరించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో పాలిసెట్‌కు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నామని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో తమ సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.